# నిద్ర



కలువకొలను సదానంద

చిత్రమైన కలగన్నాడు బాలూ.

కలలో లేచి నడిచాడు వాడు.

అర్ధరాత్రి ...

"బాలూ, గోనెసంచీ పట్టుకురా!"

"బాలూ, గోనెసంచీ పట్టుకురా!"

"బాలూ, గోనెసంచీ పట్టుకురా!"

ఎక్కణ్ణుంచో ఓ దేవతా స్వరం ఎడతెరిపి లేకుండా వినబడుతోంది. ఇంట్లో పడుకుని నిద్రపోతున్న బాలూ గుండె ఆ తీయదనానికి పులకించి పోయింది.

దుప్పటి తొలగదోసుకుని పైకి లేచాడు వాడు.

"బాలూ, గోనెసంచీ పట్టుకురా!"

దండెం మీద వేలాడుతున్న చింకి గోతం లాగి భుజాన వేసుకున్నాడు. తలుపు తెరిచి వీథిలోకి నడిచాడు.

ఆ దేవతా రూపం కంటికి కనిపించలేదు.

పన్నీటి జల్లుల్లాంటి నవ్వులు, తేనెసోనల్లాంటి పిలుపులూ మాత్రం వినిపిస్తున్నాయి.

"రా!"

"కదలి రా!"

"ఇటూ!"

"ఇక్కడే ...."

బజారు వీథిలోకి నడిచాడు బాలూ.

నవ్వులు!

నిర్జనంగా, నిశ్శబ్దంగా నిద్రపోతున్న బజారు నిండా నవ్వులు!

కిరాణా కొట్టులోంచి, బట్టల దుకాణంలోంచి, బ్యాంకులోంచి ... బంగారు తీగల మాణిక్యవీణలు మోగినట్లు పరతెంచి వస్తున్నాయి నవ్వులు.

........ నవ్వులు ఆగిపోయాయి.

నడిబజార్లో నయన సుందరంగా ప్రత్యక్షమయింది పరదేవత.

ఎంత దివ్య మంగళ రూపం!

సంతోషంతో పొంగిపోయాడు

బాలూ.

"నీకు వరాలివ్వటానికి వచ్చాను. ఏదీ, గోనెసంచీ పట్టుకొచ్చావా? ఏం కావాలో చెప్పు!" అంది ఆమె.

"మా నాన్నకి ఆదాయం తక్కువ. మా ఇంట్లో అందరం పస్తులుంటాం. మరి మా అందరికి లడ్లూ, జిలేబీలూ, మైసూరు పాకులూ, గారెలూ, బూరెలూ ..."

"నాతోరా!"

ఆమె వాడి భుజం మీద చేయి వేసింది. ఆ ఊరి షావుకారుగారింటి ముందున్న ఆకాశమంత పందిట్లోకి నడిచారు ఇద్దరూ. షావుకారు కుమార్తెకు ఆ రోజు ఆ పందిట్లోనే పెళ్లి జరిగి, సద్దు మణిగింది. పరదేవత చెయ్యి పైకెత్తి బంగారు బెత్తం గిరగిరా తిప్పుతూ, "దరిద్రమా తొలగిపో!" అంది బిగ్గరగా.

బాలూ ఆశ్చర్యపోయాడు.

వాడి ముందర వెయ్యి అరిటాకులున్నాయి. వాటి నిండా లడ్లు, జిలేబీలు, మైసూరు పాకులు, గారెలు, బూరెలు! వాటన్నిటినీ అలాగే ఆకుల్లో చుట్టి గోనె సంచీలో కుక్కేశాడు బాలూ.

"ఇంకేం కావాల్రా?"

"మా ఇంట్లో ఎవరికీ మంచి బట్టల్లేవు..."

"రా నాతో!"

వాడి భుజం మీద చెయ్యి వేసిందామె. మళ్లీ బజార్లోకి నడిచారిద్దరూ.

ఓ పెద్ద బట్టల దుకాణం ముందర నిలబడి, బెత్తం గిరగిరా తిప్పుతూ, "దరిద్రమా పారిపో!" అంది పరాశక్తి.

రకరకాల బట్టలు-రంగురంగుల బట్టలు-వాడి కాళ్ల ముందర వచ్చి పడ్డాయి.

వాటని తీసి గోనె సంచీలో వేసుకున్నాడు.

"ఇంకా ఏమైనా అడుగురా!"

"మాకు ఇల్లు లేదు. అద్దె కొంపలో ఉంటున్నాం. ఒకటే ఇరకాటం అది. ఇంటివాడు ఇల్లొదిలి వెళ్లి పొమ్మంటున్నాడు."

'స్థలం కొనుక్కొని, కొత్త మేడ కట్టుకోండి!' అంది జగదంబ.

బ్యాంకు ముందు నిలబడి, మంత్రదండం గిరగిరా తిప్పి "దరిద్రమా పారిపో!" అంది.

ఆకాశంలోంచి జలజలా రాలాయి కరెన్సీ నోట్లు! రోడ్డునిండా చెల్లాచెదురుగా పడిపోయాయి.

ఒక్కొక్కటే ఏరి సంచీలో వేసుకున్నాడు బాలూ. గోతం మూట నెత్తిన పెట్టుకున్నాడు.

"అదేమిట్రా? ఇంకేమీ వద్దా?"

"ఇంకేమి వద్దు."

"మంత్రి పదవి?"

"దాని కోసం ఏడ్చేవాళ్లు వేరే ఉన్నారు. నే నడిగింది ఇచ్చావు, అంతే చాలు!"

"గడుసోడివే! ... పదా, నేనూ వస్తా ఇంటి దాకా!"

మూట మోసుకుని ఇంటికి వచ్చాడు బాలు.

"ఇక వెళ్లొస్తాన్రా బాలూ! సర్వేజనా స్సుఖినో భవంతు!" అంది లోకేశ్వరి.

"వందేమాతరం!" అంటూ తలుపు మూసుకున్నాడు వాడు.

ఇంటిలోని వారంతా ఒళ్లు మరిచి నిద్రపోతున్నారు.

ఒక మూలకు వెళ్లి మూట దించాడు బాలూ. పట్టరాని సంతోషాన్ని పగ్గాలతో లాగి పట్టుకుంటూ, మూట కుమ్మరించి, విస్తుపోయి నిలబడ్డాడు.

ఏవీ పిండివంటలు?

ఏవీ కొత్త బట్టలు?

ఏవీ కరెన్సీ నోట్లు?

మూట నిండా-ఎంగిలాకులు! చింకి పీకలు! చిత్తుకాగితాలు!

అవి ఇక్కడి కెలా వచ్చాయో అర్థం కాలేదు వాడికి.

పరదేవత ఇచ్చినవి ఇవేనా?

ఆ చెత్తా చెదారమంతా తిరగేశాడు బాలూ. అందులో ముకుళిత హస్తాలతో ఓ బొమ్మ దొరికింది. ఎన్నికల కరపత్రం అది. దాన్నిండా వాగ్దానాలు.

ఎంగిలాకులే పిండివంటలు!

చింకిపీకలే కొత్త బట్టలు!

చిత్తుకాగితాలే కొత్త మేడలు!

.... నిట్టూర్చాడు బాలూ.

కోరికలన్నీ ఈ రూపంలో తప్ప, మరో విధంగా ఫలించవని తెలిసిరాగానే వాడికి ఏడుపొచ్చింది. ఆ ఏడుపులో కోపం వచ్చింది. ముఖం ఎర్రబడింది.

పిడికిళ్లు బిగుసుకున్నాయి.

•



**దుబారా**

"రోజు రోజుకీ మా వాడు చాలా దుబారాగా పెరిగిపోతున్నాడు బావా. డబ్బంటే కొంచెమైనా జాగ్రత్త లేదు."

"ఏమయ్యింది బావా?"

"మొన్న వాళ్ల స్నేహితులతో రాజమండ్రి వెళ్లాడు. పందాలు వేసుకుని వాళ్ల స్నేహితుడొకడు అయిదు రూపాయల నోటు గోదావరిలో వేస్తే, మరొకడు పది రూపాయల నోటు వేశాడట. మావాడయితే ఏకంగా వెయ్యి రూపాయలకు చెక్కు రాసి సంతకం పెట్టి మరీ గోదావరిలో పడేశాడట. చూశావా?"

"ఆ!!!"

వి.వి. సీతారామ్ దాస్ (గుంటూరు)

